ఈత, ఖర్జూర మొక్కలను నాటిన గీతకార్మికులు

వన మహోత్సవంలో పాల్గొన్న గీతకార్మికులు

కోటగిరి, జూలై 24 : మండలంలోని లింగాపూర్ చెరువుకట్టపై రాష్ట్ర గీతాపనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్ ఆధ్వర్యంలో గీతకార్మికులు బుధవారం చెరువు కట్టపై ఈత, ఖర్జూరా మొక్కలను నాటారు. కార్యక్రమంలో వెంకాగౌడ్, శ్రీధర్‌గౌడ్, పండరిగౌడ్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 10, 11న హలో 'మాదిగ - చలో ఢిల్లీ'

డిచ్‌పల్లి, జూలై 24 : ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10, 11న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'హలో మాదిగ – చలో ఢిల్లీ' చేపట్టనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు డల్లా సురేశ్ మాదిగ, గంధమాల నాగభూషణ్ తెలిపారు. డిచ్‌పల్లిలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను వారు బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. ఎంపీ అర్వింద్ పార్లమెంట్‌లో మాదిగల పక్షాన మాట్లాడాలని కోరారు. జిల్లా అధికార ప్రతినిధి సంగెం కిష్టయ్య, సీనియర్ నాయకుడు నర్సయ్య పాల్గొన్నారు.

టీయూకు రూ. 200 కోట్లు కేటాయించాలి

డిచ్‌పల్లి, జూలై 24 : తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 200 కోట్లు కేటాయించాలని టీయూ పీడీఎస్‌యూ నాయకులు రవీందర్, అక్షయ్ డిమాండ్ చేశారు. టీయూలో వారు బుధవారం విలేకరులతో మాట్లాడారు. టీయూకి రెగ్యులర్ వీసీని నియమించాలని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలని, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, అర్జున్, రాకేశ్, సాయికృష్ణ, సాయిప్రకాశ్, మన్యంకొండ పాల్గొన్నారు.

డిగ్రీ సీబీసీఎస్ పరీక్షలకు రివాల్యుయేషన్

డిచ్‌పల్లి, జూలై 24 : టీయూ పరిధిలోని డిగ్రీ (సీబీసీఎస్) 2, 4, 6వ సెమిస్టర్ (రెగ్యులర్) 1, 3, 5వ సెమిస్టర్ (బ్యాక్‌లాగ్) పరీక్షల రివాల్యుయేషన్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారిణి అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 3 నుంచి 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఒక్కో పేపర్‌కు ఫీజు రూ.500 చెల్లించాల్సి ఉటుందని పేర్కొన్నారు.

గడ్కోల్ వీడీసీ ఎన్నిక

గడ్కోల్ నూతన వీడీసీ

సిరికొండ, జూలై 24 : మండలంలోని గడ్కోల్ గ్రామాభివృద్ధి కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాళ్లపల్లి రవిగౌడ్, ఉపాధ్యక్షుడిగా సబావత్ ప్రకాశ్, క్యాషియర్‌గా గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీగా కర్నాల ప్రభు, సలహాదారుడిగా ఇమామ్‌ను ఎన్నుకున్నారు. వీడీసీని గ్రామస్తులు శాలువా, పూలమాలలతో సన్మానించారు.

తెలంగాణ హాకీ అకాడమీకి తూంపల్లి విద్యార్థి

అర్బాస్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సిరికొండ, జూలై 24 : మండలంలోని తూంపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎస్‌కే అర్బాస్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అకాడమీకి ఎంపికైనట్లు పీఈటీ నాగేశ్ తెలిపారు. వనపర్తి జిల్లాలో ఈ నెల 3, 4వ తేదీల్లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి అకాడమీకి ఎంపికైనట్లు చెప్పారు. అర్బాస్‌ను పాఠశాలలో హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ లావణ్య, వీడీసీ సభ్యులు బుధవారం అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని వినతి

బాల్కొండ, జూలై 24 : మండల కేంద్రంలోని వ్యవసాయ పంట భూముల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు విద్యుత్ అధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పంట భూములకు ఇదివరకు ఉన్న 16, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోతే మరమ్మతులకు ఇబ్బందికరంగా ఉందని, వాటిని తొలగించి 60, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామ పెద్దలు, రైతులు ఉన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

మోర్తాడ్, జూలై 24: మండల కేంద్రంలో దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నవయుగ కవి చక్రవర్తి గుర్రంజాషువా వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాజారాం, బాబురావు, గంగాధర్, గౌతమ్, నర్సయ్య పాల్గొన్నారు.

50 రోజుల్లో 325 కేసులు నమోదు

ఆర్మూర్‌టౌన్, జూలై 24: ఆర్మూర్ డివిజన్ పరిధిలోని పోలీస్, ఆర్టీఏ సంయుక్తంగా జూన్ నుంచి ఈ నెల మొదటి వారం వరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 325 కేసులు నమోదు చేసినట్లు ఎంవీఐ వివేకానంద రెడ్డి బుధవారం తెలిపారు. 37 మంది మైనర్లు ఉన్నారని, వీరికి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. మొత్తం 24,18,435 రూపాయలు పెనాల్టీ విధించినట్లు తెలిపారు. వాహనాలు అజాగ్రత్తగా నడుపవద్దని, వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని ఆయన సూచించారు.

ఆర్మూర్ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో

ఆర్మూర్‌టౌన్, జూలై 4: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల స్వామి బుధవారం తెలిపారు. కళాశాలలో వసతులు, అభ్యాసన వాతావరణంపై ప్రముఖ ప్రామాణిక గుర్తింపు సంస్థ ఐఎస్‌వో వారు కళాశాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఐఎస్‌వో గుర్తింపు లభించడం గర్వంగా ఉందని తెలిపారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

ఆర్మూర్‌టౌన్, జూలై 24: పట్టణంలోని ఆర్మూర్ ఏరియా దవాఖానను మున్సిపల్ కమిషనర్ రాజు బుధవారం తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల వివరాలు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన సూచించారు.

పోచమ్మకు బోనాలు

ఎడపల్లి, జూలై 24: ఎడపల్లి మండలం బాపునగర్ గ్రామస్తులు బుధవారం పోచమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ మండలాలు, గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నందిపేట మండల కేంద్రంలో నందికేశ్వరాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్, నందిపేట్‌లో మొక్కలు నాటారు.

– నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూలై 24

జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవనలో కేక్ కట్ చేస్తున్న మేయర్ నీతూకిరణ్, బీఆర్‌ఎస్ నాయకులు

మోర్తాడ్‌లో కేక్ తినిపించుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కమ్మర్‌పల్లిలో కేక్ కట్‌చేస్తూ..

నందిపేట్‌లో పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వేల్పూర్‌లో..

ఏర్గట్లలో..

రుద్రూర్‌లో..

మోస్రాలో..

సిరికొండలో..

బాల్కొండలో..

కేటీఆర్ భవిష్యత్తులో గొప్ప నాయకుడు అవుతాడు: మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

డిచ్‌పల్లి, జూలై 24 : కేటీఆర్ భవిష్యత్తులో గొప్ప నాయకుడవుతాడని మాజీ ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా డిచ్‌పల్లిలోని మానవతాసదన్‌లో ఆయన కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. తెలంగాణ, ఐటీ రంగ అభివృద్ధిలో కేటీఆర్ కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. చిన్నవయస్సులోనే ఐటీ, పంచాయతీరాజ్ శాఖలను సమర్థవంతంగా పరిపాలించిన నాయకుడని కొనియాడారు. మానవతా సదస్సును మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కవిత ఏర్పాటుకు కృషిచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సాంబారి మోహన్, శక్కరికొండ కృష్ణ, లక్ష్మీనర్సయ్య, హన్మంత్‌రెడ్డి, కుంచాల విమలారాజు, పుప్పాల గీత, విజయ, నయీం, రవి, గంగదాస్, పాశంకుమార్, అరటి రఘు, నామాల గంగాధర్, కమల నరేశ్, మురళి, మధుకర్ రావు పాల్గొన్నారు.

నగరంలోని అర్సపల్లిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ మకరంద్ బుధవారం పరిశీలించారు. విద్యార్థులు, చిన్నారులు వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు.
– ఖలీల్‌వాడి, జూలై 24

రుద్రూర్ మండలకేంద్రంలోని లక్ష్మీగణపతి ఆలయంలో కుంకుమార్చన పూజలను అర్చకుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.
– రుద్రూర్, జూలై 24

ప్రమాదరహిత వారోత్సవాలు

నిజామాబాద్ డిపోలో ఉత్తమ ఉద్యోగిని సన్మానిస్తున్న ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులు

ఖలీల్‌వాడి/ బోధన్/ ఆర్మూర్ టౌన్, జూలై 24 : జిల్లాకేంద్రంలోని నిజామాబాద్ డిపో–1లో రీజినల్ మేనేజర్ జాని రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రమాద రహిత వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ రవాణా అధికారిణి హాజరై ఉత్తమ ఉద్యోగులను సన్మానించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. దసరా –2023 పండుగ సందర్భంగా బస్సులో ప్రయాణించిన లక్కీడ్రా విజేతలు 5 మహిళలు, 5 పురుషులకు రూ. 9,900 డీడీలు అందజేశారు. టీజీఆర్టీసీ ఆదేశాల మేరకు ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర్‌రావు, రాహుల్, ఆనంద్, సాయన్న, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ప్రమాదరహిత వారోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ఏసీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం పలువురు డ్రైవర్లను డిపో తరపున సన్మానించి, పారితోషికాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ శ్రీనివాస్ రావు, డిపో మేనేజర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని బస్‌డిపో కార్యాలయంలో ప్రమాదరహిత వారోత్సవాలు డిపో మేనేజర్ రవికుమార్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎంవీఐవివేకానంద రెడ్డి హాజరై మాట్లాడారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మోర్తాడ్/ ముప్కాల్/ నవీపేట/ ఆర్మూర్‌టౌన్, జూలై 24: బదిలీలు, ప్రమోషన్లపై వెళ్లిన ఉపాధ్యాయులు సిరిల్‌రావు, విజయలక్ష్మి, రికార్డు అసిస్టెంట్ శ్రీనివాస్‌రావును మోర్తాడ్ మండలంలోని పాలెం ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం సన్మానించారు. ముప్కాల్ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పదోన్నతి, బదిలీ పై వెళ్లిన సురేశ్ కుమార్, అమ్జత్ ఖాన్, రేణుక, శోభ, గీత, కవిత, రజితను సన్మానించారు. నవీపేట మండలం నాళేశ్వర్ పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన కమలాకర్‌రావు, గంగాధర్, వైశాలి, శ్రీనివాస్, శోభారాణి, విశ్వనాథ్‌ను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీదీప్, మాజీ సర్పంచి సరిన్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఆర్మూర్ మండలం చేపూర్, అంకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ప్రమోషన్లపై వెళ్తున్న సందర్భంగా సన్మానించినట్లు హెచ్‌ఎంలు కృష్ణయ్య, మల్లేశ్వరి బుధవారం తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

భీమ్‌గల్, జూలై 24 : మండలంలోని సికింద్రాపూర్ పెద్దమ్మకడి తండా గ్రామంలో ట్రైనీ కలెక్టర్ సాంకేత్‌కుమార్ బుధవారం పర్యటించారు. ఉపాధి హామీలో భాగంగా డంపింగ్ యార్డు, నర్సరీ పనులను పరిశీలించారు. మహిళా సంఘాలతో పాటు గ్రామ యువకులు, రైతులతో కలిసి ప్రభుత్వ పాఠశాల, గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఏపీఎం రవీందర్, సీనియర్ సీసీ పురస్తు నరేశ్, ఎంపీవోలు గంగామోహన్, దావిద్, సెక్రటరీ మాధవి, టెక్నికల్ అసిస్టెంట్ రమేశ్, రత్నాకర్, మహిళా సంఘాల సభ్యులు, రైతులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఆందోళన

శక్కర్‌నగర్, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం ఆం దోళన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు ఏశాల గంగాధర్ మాట్లాడుతూ బడ్జెట్‌లో కేవలం ఏపీ, బీహార్ రాష్ట్రాలకు మినహా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తిరునగరి శశికళ, నాయకులు గైని రాములు, షేక్ నజీర్, అడప బొర్ర సాయిలు, పల్లికొండ చింటు, సాయినాథ్ నేహాల్ ఉన్నారు.

సంక్షిప్తంగా..

● **'మానసిక ఆందోళన'పై అవగాహన:** ఆర్మూర్‌టౌన్, జూలై 24:పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో సీజనల్ వ్యాధులు, మానసిక ఆందోళనపై ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జిల్లా మానసిక ఆరోగ్య అధికారి డాక్టర్ రవితేజ బుధవారం అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ ఫెర్దోస్ ఫాతిమా,జిల్లా ఆరోగ్య బోధకురాలు స్వామి సులోచన,హెల్త్ అసిస్టెంట్ ఆనంద్ పాల్గొన్నారు.

● **కేంద్ర ప్రభుత్వం విఫలం:** ఆర్మూర్‌టౌన్, జూలై24: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు ఇవ్వడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ నాయకుడు పోల సుధాకర్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో తెలంగాణ ఊసే ఎత్తకపోవడంతో ప్రజలు నిరుత్సాహానికి గురవుతున్నారని తెలిపారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

● **ఆలయ పాలకవర్గాల నియామకాలకు ప్రతిపాదనలు:** శక్కర్‌నగర్, జూలై 24: బోధన్ పట్టణంలో శ్రీ చక్రేశ్వర శివమందిరం, మారుతీ మందిరాల పాలకవర్గాల నియామకాలకు ప్రతిపాదనలను స్థానిక ఎమ్మెల్యేసుదర్శన్ రెడ్డి ద్వారా ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. శ్రీ చక్రేశ్వర శివమందిరానికి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుంకోజు హరికాంత్ చారితో పాటు పలువురి పేర్లతో, మారుతీ మందిరానికి గుండేటి శంకర్‌తో పాటు పలువురి పేర్లతో ప్రతిపాదనలు పంపారు.

క్రిస్టియన్స్ పాస్టర్ల అసోసియేషన్ మండల నూతన కార్యవర్గం

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

నవీపేట, జూలై 24: మండలం కేంద్రంలో ఇండియన్ పెంతోకోస్తు చర్చిలో మండల క్రిస్టియన్స్ పాస్టర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా నెహమ్యా, ఉపాధ్యక్షుడిగా రత్నయ్య, చైర్మన్‌గా ఏసుదాస్, ప్రధాన కార్యదర్శిగా జగన్, సంయుక్త కార్యదర్శిగా చిట్టిబాబు, కోశాధికారిగా సురేశ్‌కుమార్, మహిళ కమిటీ కార్యదర్శిగా సజ్జా జయంతి, ప్రధాన సలహాదారులుగా సాలోమాన్ జాషువా, పాస్టర్ చార్లెస్, అసోసియేషన్ అధ్యక్షుడిగా పాస్టర్ రమేశ్ ఆనంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా అధ్యక్షుడు జక్రయ్య ఆనంద్ అభినందించి మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న చర్చిలకు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని కోరారు.

జిల్లా ప్రజలకు ఎంపీ అర్వింద్ క్షమాపణ చెప్పాలి

సీపీఎం నాయకులు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఖలీల్‌వాడి, జూలై 24 ఐదేండ్ల క్రితం జిల్లాకు పసుపు బోర్డును తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి, పార్లమెంట్‌లో పసుపుబోర్డుతో పాటు ఇతర సమస్యలపై పెదవి విప్పకపోవడంపై జిల్లా ప్రజలకు ఎంపీ అర్వింద్ క్షమాపణ చెప్పాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో వారు బుధవారం విలేకరులతో మాట్లాడారు. బాండ్‌పేపర్ రాసిచ్చిన తర్వాత మరో నాలుగేండ్ల పాటు పసుపు బోర్డు అవసరం లేదని బుకాయిస్తూ, ఎన్నికల ముందు పీఎం మోదీతో జిల్లాకేంద్రంలో పసుపుబోర్డును ఏర్పాటు చేయిస్తామని హామీ ఇప్పించారని గుర్తుచేశారు. పసుపు బోర్డు, నిజామాబాద్ –ఆదిలాబాద్ రైల్వేలైన్, బోధన్ –బీదర్ రైల్వేలైన్ ఏర్పాటు కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, అయినా ఎంపీ అర్వింద్ నోరు మెదపకపోవడం జిల్లా ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు, నాయకులు రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ రాజీనామా చేయాలి

మోర్తాడ్, జూలై 24: బీజేపీ ప్రభుత్వం పసుపు బోర్డుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా నిజామాబాద్ పసుపు రైతులను రెండోసారి మోసం చేసిందని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంపీ అర్వింద్ జిల్లా రైతులకు క్షమాపణ చెప్పి, రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనిలదీస్తామని అన్నారు. కమ్మర్‌పల్లిలో వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్రమంత్రులు, ఆరుగురు ఎంపీలు ఉండి కూడా రాష్ట్రానికి ఏం తీసుకురాలేకపోయారని విమర్శించారు. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్, భాస్కర్, దేవేందర్, రాజేశ్, బుచ్చన్న, నర్సయ్య, ప్రదీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ధర్పల్లి, జూలై 24 : మండలంలోని ప్రాజెక్టు రామగుడు గ్రామంలో పేకాట స్థావరంపై బుధవారం దాడి చేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు. రామడుగు గ్రామశివారులోని చెట్టు కింద పేకాడుతున్నారన్న సమాచారం మేరకు పేకాటస్థావరం దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని, రూ.2,180 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

వినాయక్‌నగర్, జూలై 24 : నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని ప్లాట్‌ఫాంతో పాటు ట్రైన్లలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న 11 బాధితులకు బుధవారం సెల్‌ఫోన్లను అందజేసినట్లు రైల్వే ఎస్సై సాయారెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన వారు సెల్‌ఫోన్లను పోగొట్టుకొని, ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు.

రైలులో నుంచి పడి వ్యక్తి మృతి

వినాయక్‌నగర్/ ఇందల్వాయి, జూలై 24 : నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని సిర్నాపల్లి రైల్వేస్టేషన్ మెయిన్ లైన్ యార్డ్ వద్ద కదులుతున్న రైలుతో నుంచి బుధవారం ఓ వ్యక్తి మరణించాడని రైల్వే ఎస్సై సాయారెడ్డి వెల్లడించారు. సుమారు 30–35 ఏండ్లు ఉన్న వ్యక్తి ఎరుపు రంగు గీతల షర్టు ధరించి ఉన్నాడని, ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతిచెందినట్లు గుర్తించామని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మృతుడి సంబంధీకులు రైల్వే ఎస్సై –8712658591, హెడ్ కానిస్టేబుల్ హన్మాండ్లు –9440999341 సంప్రదించాలని సూచించారు.

నగరంలో వాటర్ లీకేజీని అరికట్టాలి

ఖలీల్‌వాడి, జూలై 24 : నగరంలో వాటర్ లీకేజీని అరికట్టాలని పర్యావరణవేత్త డాక్టర్ సుధీర్‌సింగ్ అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నగరంలోని పలు వార్డుల్లో వాటర్‌లీకేజీ కారణంగా తాగునీరు కలుషితమై, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌కు వినతిప్రతం అందజేసినట్లు తెలిపారు. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

సంక్షిప్తంగా..

● **మొక్కల పరిశీలన -** కంఠేశ్వర్, జూలై 24 : నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ జిల్లాకేంద్రంలో బుధవారం పర్యటించారు. సారంగాపూర్‌లోని జోన్ –5లో వన మహోత్సవం సందర్భంగానాటుతున్న మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేసి, మొక్కల సంరక్షణకు కృషిచేయాలని సూచించారు.

● **కోటగిరి ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించిన చందర్ -** కోటగిరి, జూలై 24 : కోటగిరి ఎంపీవోగా చందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కోటగిరి ఎంపీవోగా పనిచేసిన మారుతి బదిలీలో భాగంగా వర్ని ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో అక్కడ పనిచేసిన చందర్ వచ్చారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ తనవంతు సేవలు అందిస్తానని ఆయన తెలిపారు.

● **ఇసుక డంపులకు వేలం -** పొతంగల్, జూలై 24 : మండలంలోని తహసీల్ కార్యాలయంలో ఇసుక డంపులకు బుధవారం వేలం నిర్వహించారు. ఇటీవల స్వాధీనం చేసుకున్న ఇసుకకు వేలం నిర్వహించినటట్లు తహసీల్దార్ మల్లేశ్ తెలిపారు. పొతంగల్‌కు చెందిన బురుబోయిన గంగాధర్ రూ.26 వేలకు దక్కించుకున్నట్లు తెలిపారు.

● **'రైతుబీమా' పథకానికి దరఖాస్తు చేసుకోవాలి-** ధర్పల్లి, జూలై 24 : కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. జూన్ 28లోగా పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు ఏఈఓల వద్ద ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీమా కలిగి ఉన్న రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మార్పుల కోసం ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● **పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలి -** సారంగాపూర్, జూలై 24 : మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో మధురిమ ఆదేశించారు. రూరల్ మండలంలోని మల్లారం, ధర్మారం గ్రామాల్లో ఎంపీవో ఎక్బాల్‌తో కలిసి ఆమె బుధవారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం నర్సరీలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు శ్వేత, కార్తీక, కారోబార్లు ఉన్నారు.

● **సంఘ సభ్యత్వానికి ఉపాధ్యాయుల రాజీనామా -** సిరికొండ, జూలై 24 : సిరికొండ ఆదర్శ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న రెగ్యులర్ పీజీటీ, టీజీటీలు టీఎంఎస్‌టీఏ సంఘ ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. 11 సంవత్సరాల నుంచి బదిలీలకు నోచుకోక అనేక ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. బదిలీలు చేయించడంతో టీఎంఎస్‌టీఏ పూర్తిగా విఫలం కావడంతో సంఘ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

● **పంట నమోదు వివరాల పరిశీలన -** సిరికొండ, జూలై 24 : మండలంలోని తాటిపల్లిలో ఏఈవోలు నమోదు చేసిన పంటల వివరాలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్ బుధవారం పరిశీలించారు. క్రాప్ బుకింగ్ యాప్ ద్వారా సర్వే నంబర్ల వారీగా రైతులు ఏ రకం పంటలు సాగు చేస్తున్నారో నమోదు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ఏవో వెంకటేశ్ ఉన్నారు.

● **బోధన్ డీఎల్పీవోగా మధుకర్:** బోధన్ రూరల్, జూలై 24: బోధన్ డివిజన్ పంచాయతీ ఇన్‌చార్జి అధికారిగా మధుకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన డీఎల్పీవో సాయిబాబా నర్సాపూర్‌కు బదిలీ కాగా, బోధన్ ఎంపీవో మధుకర్ ఇన్‌చార్జి డీఎల్పీవోగా బాధ్యతలు చేపట్టారు.

● **అంత్యక్రియలకు ఆర్థిక సాయం:** మోర్తాడ్, జూలై 24: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త దశరథ్ అనారోగ్యంతో మృతి చెందగా.. బాధిత కుటుంబానికి పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో రూ.10 వేలు బుధవారం అందజేశారు. పార్టీ బాల్కొండ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి సహకారంతో దశరథ్ అంత్యక్రియలకు రూ.పదివేలు అందజేసినట్లు స్థానిక నాయకులు తెలిపారు.

● **'పారిశుద్ధ్య' సమస్యలు పరిష్కరించాలి:** శక్కర్‌నగర్, జూలై 24: బోధన్ పట్టణంలోని ఒకటో వార్డుతో పాటు అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆమ్‌ఆద్మీ పార్టీ బోధన్ కన్వీనర్ జునేద్ అహ్మద్ ఖలీల్‌తో పాటు పలువురు ఆర్డీవో రాజేశ్వర్‌కు బుధవారం వినతపత్రం అందజేశారు.

● **కరపత్రాల ఆవిష్కరణ:** శక్కర్‌నగర్, జూలై 24: హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో ఆగస్టు 1,2వ తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య జాతీయ జనరల్ బాడీ సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను జిల్లా కన్వీనర్ ఎండీ మోసీన్, బోధన్ డివిజన్ కన్వీనర్ కళ్యాణ్ బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నిఖత్ ఖౌసర్, అధ్యాపకుడు శ్రీనివాస్‌తో కలిసి బుధవారం ఆవిష్కరించారు.

● **సాటాపూర్‌లో స్పెషల్ డ్రైవ్:** రెంజల్, జూలై 24: మండలంలోని సాటాపూర్ గ్రామంలో బుధవారం పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపటినట్లు ఎంపీవో రఫియొద్దీన్ తెలిపారు. ఇందిరమ్మ కాలనీలో మురికి కాలువలను జేసీబీ సహాయంతో శుభ్రం చేసినట్లు పేర్కొన్నారు.

● **మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి:** రెంజల్, జూలై 24: అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు. బుధవారం మండలంలోని వీరన్నగుట్ట, వీరన్నగుట్ట తండా గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల పిల్లల నమోదు చేసిన హాజరు పట్టికను తనిఖీ చేసినట్లు తెలిపారు. నమోదైన పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

● **మాదకద్రవ్యాలపై అవగాహన:** ఎడపల్లి, జూలై 24: మండలంలోని ఏఆర్పీ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై స్థానిక పోలీసులు బుధవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు, గుట్కాలు, సిగరెట్లకు దూరంగా ఉండాలని సూచించారు. హెచ్‌ఎం రమేశ్, కానిస్టేబుళ్లు భీంరావ్, లాల్జి, కేవ, గణేశ్ పాల్గొన్నారు.

● **బీజేపీ కార్యవర్గ సమావేశం:** మాక్లూర్, జూలై 24 : మండలంలోని అడవి మామిడిపల్లిలో బీజేపీ మాక్లూర్ మండల శాఖ అధ్యక్షుడు రమావత్ సురేశ్ నాయక్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, కార్పొరేటర్ పంచరెడ్డి ప్రవళిక హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు.

● **నూతన కార్యవర్గం ఎన్నిక:** ఆర్మూర్‌టౌన్, జూలై 24: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ 2024–25 నూతన కార్యవర్గం బుధవారం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడిగా రజనీష్ కిరాడ్, కార్యదర్శిగా రాస ఆనంద్ ఎన్నికయ్యారు.